# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 130 | విశాఖపట్నం | 10-2-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue :130 | VISAKHAPATNAM | 10-2-2026 TUESDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశాం: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో సమీక్షా సమావేశం సోమవారం జరిగింది. గత 19 నెలల ప్రభుత్వ పాలన, పథకాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, గడిచిన 19 నెలల్లో రాష్ట్రాన్ని అగాధం, అంధకారం నుంచి బయటపడేశామని, కుప్పకూలిన వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టగలిగామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే తొలి ప్రాధాన్యమని ఆయన పునరుద్ఘాటించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ముఖ్యమంత్రి తెలిపారు. 'తల్లికి వందనం' ద్వారా తల్లుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు జమ చేశామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న 'స్త్రీశక్తి' పథకం ద్వారా రాష్ట్రంలో మహిళల మొబిలిటీ పెరిగిందని, ఇప్పటివరకు 4.29 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని వివరించారు. దీనివల్ల ప్రస్తుతం ఉన్న బస్సుల ఆక్యుపెన్సీ కూడా గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు రూ. 6,310 కోట్ల ఆర్థిక సహకారం అందించామని తెలిపారు. వీటితో పాటు 'దీపం 2.0' ద్వారా 2 కోట్ల గ్యాస్ సిలెండర్లు, 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల ద్వారా రూ.58 వేల కోట్ల ఆర్థిక చేయూత అందించినట్లు వెల్లడించారు.




వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించామని, డిమాండ్‌కు అనుగుణంగా పంటలు పండించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నామని చంద్రబాబు అన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా, కోస్తా తీరాన్ని ఆక్వా కల్చర్‌లో అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు ఆత్మహత్యలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఒకవేళ దురదృష్టవశాత్తు ఎవరైనా ఆత్మహత్యకు పాల్పడితే, ఆ కుటుంబాలను ఆదుకుంటున్నామని చెప్పారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవడం ద్వారా నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటున్నామని, ప్రతీ మూడు నెలలకోసారి పనుల పురోగతిపై బేరీజు వేస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇన్‌చార్జ్ మంత్రులు కూడా ఇదే వేగంతో క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. "సంక్షేమ పథకాలు అవసరమా అనే చర్చ సరికాదు. పేదలను ఆదుకోవడానికి సంక్షేమ పథకాలు కచ్చితంగా అవసరమే" అని (తరువాయి 2వ పేజీలో)

## అనుకున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలి : పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** అనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి పూర్తిచేయాలని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన వివిధ శాఖల కార్యదర్శుల సమీక్షలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ .... క్షేత్రస్థాయిలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించవద్దని సూచించారు. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు ఎవరికి వారు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాల్సిందేనన్నారు. తాము నాలుగు గోడల మధ్య కూర్చునే వ్యక్తులం కాదని, అంతా అద్భుతంగా ఉందని చెబుతున్నా.. కొన్నిచోట్ల గ్యాప్స్ ఉన్నాయని వ్యాఖ్యానించారు. అనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి పూర్తిచేయాలని స్పష్టం చేశారు. పాలసీలను అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నామన్నారు. పల్లెపండుగకు రూ.2,500 కోట్లు, అడవితల్లి బాటకు రూ.1,005 కోట్లు మంజూరు చేశామని చెప్పారు.



2లో

### అంబటి రాంబాబుకు రెండో షాక్... మరో కేసులో రిమాండ్ విధించిన కోర్టు



6లో

### కాఫీని అధికంగా తాగితే ఏం జరుగుతుంది..?



7లో

### 'ఉపాధి' పనుల స్పీడ్‌కు బ్రేకులు

బిల్లుల అప్‌లోడ్‌కు కేంద్ర పోర్టల్‌లో అడ్డంకులు

## అసలు, సిసలు దొంగలు అధికారులే!!



- అత్యవసర పిర్యాదుకు 75 రోజులు తరువాత ఎండార్స్‌మెంట్
- దేవరాపల్లి, పీజిఆర్ఎస్‌లో పెట్టిన దరఖాస్తులకు పొంతన లేని సమాధానాలు
- ఎండార్స్‌మెంట్ ఎప్పుడు చేయ్యాలో చెప్పండి..

**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దొంగలు పడ్డ 75 రోజులు తరువాత రెవెన్యూ అధికారులు దర్యాప్తు జరిపి 76 రోజులు తరువాత ఎండార్స్‌మెంట్ ఇచ్చారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న విలేకరుల సమావేశంలో అన్నారు. దేవరాపల్లి రెవెన్యూ పరిధిలో బిల్లలమెట్ట సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి తరలించుకుపోతున్నారని ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని తేదీ 1/12/2025 (డిశంబరు1)న పిజిఆర్ఎస్‌లో పిర్యాదు చేశారు. 6/2/2026 ఫిబ్రవరి 2వ తేదీన తహాశీల్దార్‌కు ఇచ్చిన నివేదిక ప్రకారం 7/2/2026న (తరువాయి 2వ పేజీలో)

## లంచం తీసుకుంటూ ... ఏసీబీకి చిక్కిన పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్



**ప్రకాశం, పతాకం న్యూస్:** పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన సోమవారం ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలంలో జరిగింది. కొత్తపట్నం మండలం కే.పల్లెపాలెం పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సంపత్ కుమార్ రూ.55,000 లంచం తీసుకుంటుండగా ఒంగోలు ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

## బీఆర్ఎస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారు: రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ చేసిందేమీ లేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ పదేళ్లు నిధులు, అధికారం వారి చేతిలోనే ఉందని, అప్పుడేం చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని రావడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల చేతుల్లోనే కీలక శాఖలు ఉన్నాయని గుర్తు చేశారు. వారు ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే వచ్చేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కేసీఆర్ ఇప్పటి వరకు సభకు రాలేదని, ఇప్పుడు వార్డుల్లో బీఆర్ఎస్ వారిని గెలిపిస్తే వారు అభివద్ధిని అడ్డుకుంటారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల్లో అహంకారం, విషం చిమ్మడం, విద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టే మాటలు తప్ప ఏమీ లేదని అన్నారు. వారు స్థాయి మరిచి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, చూస్తుంటే వారి గురించి ఈగల్ టీమ్ గురించి చెప్పాలేమోనని అన్నారు. గంజాయి లేదా కొకైన్ తీసుకుని మాట్లాడుతున్నారా అని అడగాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు.



### పెరిగిన బంగారం, వెండి ధరలు...

2లో

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## వలస

ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన ఇళ్ల గడప వరకూ వచ్చేస్తున్నాయి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అడవులను నరికివేయడం, ఖనిజాల వెలికితీత పేరుతో బడా కార్పొరేట్లకు భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ సంఘర్షణ. వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అడవి ప్రదేశం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి. దాదాపు 70 శాతం మంది భారతీయులు అడవులకు సమీపంలోనే నివసిస్తున్నారు. మనిషి- వన్యప్రాణుల సంఘర్షణ వల్ల ప్రతి సంవత్సరం 500 మందికి పైగా మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్క. ఇది వందలాది వన్యమృగాల మరణాలకూ కారణమౌతోంది. 'భూమి అందరికి తప్పనిసరి, కానీ ఇది మనందరి ఆస్తి కాదు' అంటారు గాంధీజీ. కానీ, మనం అడవులను సొంత 'ఆస్తి'గా భావిస్తూ.. విధ్వంసానికి పాల్పడుతుండటం వల్లే ప్రకృతి తిరుగుబాటు చేస్తోంది. తాజాగా తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు ఆరు రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిందో పెద్దపులి. ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది దానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. తెలంగాణలోని జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలోనూ పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి వచ్చేస్తున్నాయి. ఏనుగులు సైతం పంట పొలాల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. నెమళ్లు వంటి అరుదైన పక్షులకూ భద్రత లేకుండాపోయింది. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం... మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల వేగవంతమైన క్షీణతకు దారితీస్తోంది. ఇది సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరచడంతో పాటు, జీవవైవిధ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. 'ఒక ఆకు పడిపోతే ఆ మొక్క నొప్పి పడదా?' అంటారు రామకృష్ణ పరమహంస. అలాగే, ఒక చెట్టు పడిపోయినా ప్రకృతి నొప్పి పడుతుంది. ఇప్పుడు దేశానికి కావాల్సింది సానుభూతి కాదు- అడవుల నరికివేతను అరికట్టాలన్న దృఢనిర్ణయం, మానవుల నుంచి రక్షణ కల్పించడం. 'ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి అడవి. మనం దాన్ని కాపాడాలి' అంటారు పర్యావరణవేత్త రఘుచంద్రన్. ప్రకృతిపై మనిషికి అధికారం లేదు... బాధ్యత మాత్రమే వుంది అన్న విషయాన్ని గుర్తించాలి. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ అసమతుల్యత ఏర్పడుతోంది. వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా... అధికారులకు తెలియజేయాలి. గ్రామాల్లో అవేర్‌నెస్ క్యాంపెయిన్లు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం...అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి.

## అంబటి రాంబాబుకు రెండో షాక్... మరో కేసులో రిమాండ్ విధించిన కోర్టు



**విజయవాడ, పతాకం న్యూస్:** ఇప్పటికే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును దుర్భాషలాడిన కేసులో రిమాండ్ లో ఉన్న వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో షాక్ తగిలింది. మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ఆందోళన కార్యక్రమం సందర్భంగా... బ్యారికేడ్లను తోసివేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించారనే కేసులో ఆయనకు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ నెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు, చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై గుంటూరు మొబైల్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ విచారణ అనంతరం ఆయనను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

## పెరిగిన బంగారం, వెండి ధరలు...




**ముంబై:** బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,000, వెండి కిలో ధర రూ.2,70,000 వద్ద ఉన్నాయి. ఖరీదైన ఈ లోహాల ధరలు ఇటీవల భారీ దిద్దుబాటుకు గురయ్యాయి. బంగారం ధరలు రూ.1,80,000 నుంచి భారీగా పతనమై తర్వాత కాస్త కోలుకుంది. వెండి ధర అయితే దాదాపు సగం పతనమైంది. దీంతో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభిస్తోందని బులియన్ మార్కెట్ నిపుణులు అంటున్నారు. దీనికి ఇటీవల డాలర్ పతనం కావడం కూడా కారణమని చెబుతున్నారు. చైనా సెంట్రల్ బ్యాంకు వరుసగా 15వ నెల కూడా పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేయడంతో డిమాండ్ బాగా పెరిగిందని అంటున్నారు. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ, ద్రవ్యోల్బణ గణాంకాలు బంగారం, వెండి ధరలను ప్రభావితం చేస్తాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. వెండి దాదాపు 5 శాతం పెరిగింది. ఎంసీఎక్స్‌లో కిలో వెండి మార్చి కాంట్రాక్ట్ రూ.11,000 పెరిగి రూ.2,61,745 పలికింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.2 వేలు పెరిగి రూ.1,57,540 పలికింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ బంగారం రూ.5 వేల మార్కు దాటింది.

## కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కార్మికులు బ్రిటిష్ కాలంలోనే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ గా మార్పు చేయడాన్ని అఖిలపక్ష కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ,తక్షణమే లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన సందర్భంగా,ఈ సమ్మెను విశాఖ జిల్లాలో జయప్రదం చేసేందుకు సోమవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రారంభించారు..ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుతరావు,సిఎఫ్ టియుఐ జిల్లా కార్యదర్శి పి.లక్ష్మి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు బానిసల్లాగా మారతారని, ప్రస్తుతం అనుభవిస్తున్న హక్కులన్నీ కోల్పోతారన్నారు.లేబర్ కోడ్స్ కనుక అమలు అయితే కార్మికుల సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, జీతభత్యాల బేరం ఆడుకునే హక్కు, కనీస వేతనాలు పొందే హక్కు, ఉద్యోగ భద్రత వంటివి కోల్పోతారన్నారు. కార్మికులు సమ్మె చేస్తే ఆ సమ్మె వల్ల వచ్చే నష్టాన్ని ఆ కార్మికుల జీతభత్యాలనుండి రికవరీ చేస్తామని, సమ్మెకు పిలిపు ఇచ్చిన నాయకులను జైళ్లకు పంపుతారని,ఆ యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని,లేబర్ కోడ్స్ లో ఉన్నాయన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కంటే ముందుగా 8 గంటల పని దినాన్ని 12 గంటలు పని చేయాలని, ప్రమాదకరమైన పని ప్రదేశాలలో కూడా మహిళల చేత రాత్రులు పని చేయించవచ్చని సర్క్యులర్లు జారీ చేసిందన్నారు. గత 17 సంవత్సరాల నుంచి కనీస వేతనాల జీవోలను అనేక షెడ్యూల్లో సవరించలేదన్నారు అందుకనే ఈ సమ్మె డిమాండ్లలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని,కనీస వేతనం రూ.26 వేలకు తక్కువ లేకుండా చెల్లించాలని, ఆశ,అంగన్వాడి, మధ్యాహ్నం భోజనం పథకం,వివోఎ,ఆర్పి తదితర స్కీం వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆటో, ముఠా,బిల్డింగ్,తోపుడు బళ్ళు,షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,పిఎఫ్,ఈఎస్ఐ ఇన్సూరెన్స్ తో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరారు.

## తెలంగాణలో ముగిసిన ఎన్నికల ప్రచారం.. 11న పోలింగ్




**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఈరోజుతో ప్రచారం ముగియడంతో రాష్ట్రంలో మైకులు మూగబోయాయి. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనివార్యమైతే ఈ నెల 12న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. గెలిచిన వారు మరుసటి రోజు వార్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

(మొదటిపేజీ తరువాయి)

## బయటపడేశాం: చంద్రబాబు

సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలు, కేంద్ర ప్రాయోజిత పథకాల యాక్షన్ ప్లాన్‌పై సీఎం సమీక్షించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా సాంకేతికత వినియోగంపై, అవేర్, డేటా లేక్, పాలనలో ఏఐ టూల్స్ వినియోగంపై సీఎం దిశానిర్దేశం చేశారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానం అమలు విధానం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సహా రాష్ట్రంలో శాంతిభద్రతలపై సమీక్షించారు. 2026-27లో శాఖల కార్యాచరణ, లక్ష్యాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు సీఎం తెలిపారు. ప్రపంచం గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ వైపు మళ్లుతోందని, అమరావతి కేంద్రంగా రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్లు ఇక్కడి నుంచే తయారు చేస్తామని, ప్రపంచానికి అందిస్తామని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, డేటా సెంటర్లతో పెనుమార్పులు వస్తాయన్నారు. ప్రతినెలా 8న కేపీఐల ఆధారంగా జీఎస్‌డీపీ రూపొందించాలని అధికారులకు సూచించారు. 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారని..ు, జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేదని చంద్రబాబు దుయ్యబట్టారు. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలు చేయాల్సి ఉందని తేల్చిచెప్పారు. అల్లూరి జిల్లాలో లంబసింగి కుంకుమ పువ్వు ఉత్పత్తి అయితే అది దేశవ్యాప్త న్యూస్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏలూరు దగ్గర కోకో సిటీ కూడా ఏర్పాటు అవుతుందని తెలిపారు. కాఫీ సాగు పెంచటంతో పాటు అరకు కాఫీ బ్రాండ్‌ను కూడా బాగా ప్రమోట్ చేయాలని కోరారు. ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుందని వెల్లడించారు. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండు మార్లు పరిశీలన చేసుకోవాలన్నారు. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని ధ్వజమెత్తారు. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాల రీషెడ్యూలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. బ్యాంకర్లు ఎవరూ చారిటీ కోసం రుణాలు ఇవ్వరని వ్యాఖ్యనించారు. "నిర్దేశించుకున్న లక్ష్యాలు పూర్తి చేసే విషయంలో ఎలాంటి రాజీలేదు. సాంకేతికంగా ముందంజలో ఉన్నామే కానీ ఎక్కడా వెనుకబడి లేము. ప్రతినెలా 8న కేపీఐల ఆధారంగా జీఎస్‌డీపీ రూపొందించాలి. 19 నెలల్లో అగాధం, అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశాం. మూడు నెలలకోసారి ప్రభుత్వ ప్రగతి పనుల పురోగతిపై బేరీజు వేస్తున్నాం. సంక్షేమ పథకాలు అవసరమా? అనే చర్చ సరి కాదు. పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అవసరమే. నెలలవారీగా సమీక్షలు చేస్తూ క్షేత్రస్థాయిలో పనులు బేరీజు వేసుకోవాలి. కలెక్టర్లు, ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా చూడాలి. ఏపీలో కార్యక్రమాలు, టెక్నాలజీ వినియోగం ఎలా ఉందో అంచనా వేయాలి" అని చంద్రబాబు తెలియజేశారు. చట్టాలన్నీ సవరించుకుని అనవసరమైనవి తొలగించనున్నట్లు సీఎం తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అడ్డుపడే చట్టాలను అసెంబ్లీలో సవరిద్దామన్నారు. ప్రస్తుతం వృద్ధిరేటు 9.88 శాతం ఉండగా త్వరలో డబుల్ డిజిట్ సాధించాలని సీఎం ఆదేశించారు. సాగునీటి కోసం ఇప్పటివరకూ రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామని, విశాఖలో గూగుల్‌తో పాటు ఇతర సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటు చేస్తున్నాయని, విద్యుత్ రంగంలో ట్రూఅప్ నుంచి ట్రూడౌన్ చేసే పరిస్థితికి వచ్చినట్లు ఆయన వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో నడుస్తుందన్నారు. రూ.వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మతులు, మరో రూ.3 వేల కోట్లతో నిర్మాణాలు చేపట్టినట్లు సీఎం వివరించారు. వచ్చే మూడేళ్లలో మోస్ట్ లివబుల్ సిటీగా అమరావతిని మారుస్తామని స్పష్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కింద రూ.1100 కోట్లు ఖర్చు పెట్టినట్లు చంద్రబాబు తెలిపారు. అస్తవ్యస్తం చేసిన రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సమస్యలు పడుతున్నామన్నారు. ఆనాటి సీఎం ఇంటి పక్కన హెలిప్యాడ్ కోసం ప్రైవేటు వ్యక్తి స్థలం ఇవ్వకపోతే అతని ఇంటిని 22ఏ కింద పెట్టారన్నారు. దానిపై ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తున్నట్లు సీఎం వివరించారు. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నామని, గుట్టలుగా పేరుకుపోయిన అక్రమాల చెత్తను మార్చిలోపు తొలగించాలి సీఎం అధికారులకు సూచించారు. కొందరు మంత్రులు, అధికారులే కాదు అందరూ పనిచేస్తే మంచి ఫలితాలు అందుతాయని సీఎం సూచించారు. ప్రభుత్వ పాలసీల వల్ల అనుకున్న లక్ష్యాలను నెరవేరుస్తున్నామని, సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రాధాన్యంగా సాగుతున్నట్లు సీఎం పేర్కొన్నారు..

## అధికారులే!!

తహశీల్దార్ దరఖాస్తు దారునికి ఎండార్స్‌మెంట్ ఇచ్చారని వెంకన్న అన్నారు. మట్టి తవ్వకాలు చేపట్టిన వ్యక్తికి మాత్రం పిర్యాదు రాకముందే (డిశంబరు25)న మూడు జిరాయితీ సర్వే నెంబర్లులో తవ్విన మట్టి కేవలం వ్యవసాయ భూమి సదను చేయడానికి మాత్రమే ఉపయోగించాలని ఈ అనుమతి 7 రోజులకు మాత్రమే చెల్లు బాటు అవుతుందని ఎండార్స్‌మెంట్‌లో తహశీల్దార్ పేర్కొన్నారని తెలిపారు. ఇంతటి దుర్మార్గ మైన సమాధానం ఇప్పటి వరకు ఏ అధికారులు ఇవ్వరని తెలిపారు. డిశంబరు ఒకటిన పిర్యాదు చేస్తే పిబ్రవరి 6న దర్యాప్తు జరిపి,7 వ తేదీన వాట్సాప్ కు పంపించి 9 తేదీన విఆర్ఎ ద్వారా ఇంటికి ఎండార్స్‌మెంట్ పంపించిన గోప్ప తహశీల్దార్ దేవరాపల్లి మండల తహశీల్దార్ రని తెలిపారు,రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ కు పీజిఆర్ఎస్ లో వచ్చిన ధర ఖాస్తులు ఎప్పటికి ఆప్పుడే పరిష్కారం చేయాలని ప్రకటను లు చేస్తున్న గోప్ప పారదర్శకత గల కూటమి ప్రభుత్వం అని అన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు గొప్పలులు చెప్పుకోవటం తప్ప కూటమి పాలనలో ప్రజలు ఫిర్యాదులకు విలువ లేదన్నారు. అత్యవసర పిర్యాదును 75 రోజులు తరువాత దర్యాప్తు జరిపి 76 రోజులు తరువాత ఎండార్స్మెంట్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. మట్టి తవ్వకాలు కూడా అక్కడే సదను చేసుకోవాలని 7 రోజులు మాత్రమే అనుమతి ఇచ్చామని చెప్పిన తాసిల్దారు అక్రమంగా మట్టి తవ్వకాలు చేసిన వ్యక్తికి ఇచ్చిన అనుమతిలో తెలియ జేసిన తహశీల్దార్ నెల రోజులు పైబడి భారీ వాహనాలు ద్వారా రెండు కిలోమీటర్లు దూరం మట్టి తవ్వకాలు చేపట్టిన కాసులకు కక్కుర్తి పడి చూసి చూడనట్లు రెవెన్యూ అధికారులు వదిలేసి ఫిర్యాదుదారునికి ఈటువంటి ఎండార్స్మెంట్ ఇవ్వడం దారుణం అని సిపిఎం నెత వెంకన్న ఆన్నారు. ఇటువంటి అధికారులు ప్రవర్తన వల్ల ప్రభుత్వపై పూర్తిగా ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందని.. ఇప్పటికైనా దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారులతో దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని వెంకన్న మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు.

# పులుసుమామిడి- లుంగపర్తి రోడ్డుకు మోక్షం



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని పులుసు మామిడి- లుంగపర్తి రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ రహదారి పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఇటీవల రూ.95 లక్షలు మంజూరు చేసింది. 1.8 కిలోమీటర్ల మేర ఈ రహదారి పనులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పులుసుమామిడి నుంచి లుంగపర్తి పంచాయతీ కేంద్రానికి 2013లోని ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన్ పథకంలో అప్పటి ప్రభుత్వం రూ.1.44 కోట్లతో తారురోడ్డు నిర్మించింది. ఈ రోడ్డు మూడేళ్ల వరకు బాగానే ఉంది. ఆ తరువాత కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతిన్నది. రెండు కిలో మీటర్ల ప్రయాణానికి పలు గ్రామాల గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డంతా కొట్టుకుపోయి రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉండడంతో పలువురు ప్రమాదాలకు గురయ్యారు. లుంగపర్తి పంచాయతీ కేంద్రంలోని పీహెచ్‌సీ, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ బాలుర పాఠశాల, సచివాలయం సిబ్బంది నిత్యం విధులకు ఈ మార్గం గుండానే వెళుతుంటారు.

దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు సమర్పించినా ఫలితం లేకపోయింది. గత ఏడాది లుంగపర్తి పంచాయతీ కేంద్రానికి చెందిన గిరిజన యువత శ్రమదానంతో భారీగా ఏర్పడిన గుంతలను మట్టి, రాళ్లతో పూడ్చి కొంతవరకు ప్రయాణానికి మార్గం చూపారు. ఈ రహదారి పనులు పూర్తయితే లుంగపర్తి పంచాయతీ పరిధిలోని దిగువపట్టి, దిగువపట్టి, ఎగువపాడు, మల్లేపాడు, చీడివలస, నారింగబంద, దింసలవలస, దోనిగుమ్మి, నేలపాలెం, ఓనుకొండ, వేలగలపాడు, మెట్టవలస గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుంది.

## సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల జిల్లా అధ్యక్షుడు రామచంద్ర



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పార్ట్ టైం టీచర్లను పూర్తి స్థాయి ఉపాధ్యాయులుగా గుర్తించ మని, అలాగే వారికి రెగ్యులర్ ఉపాధ్యాయులకు వర్తింపజేస్తున్న అన్ని సదుపాయాలు కల్పించాలని ఇటీవల ఉత్తరప్రదేశ్ పార్ట్ టైం టీచర్ల కేసుపై సుప్రీం కోర్టు తీర్పు పట్ల పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల జిల్లా అధ్యక్షుడు చదరం రామచంద్ర హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అనకాపల్లి మండలం గవరపాలెం లో నిర్వహించిన పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అలాగే సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ల సర్వీసును సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా రెగ్యులర్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ ఉపాధ్యాయులకు వర్తించే సదుపాయాలన్నీ పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లకు కూడా వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఇటీవల ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడానికి ఆర్థిక శాఖ తీసుకున్న నిర్ణయంలో సొసైటీలలోను, ప్రాజెక్టులలోను పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పక్కన పెట్టడంపై విచారం వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అలాగే పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లను విద్యా శాఖలో విలీనం చేసి వారిని రెగ్యులర్ చేయాలని, ఒక వేళ ఆలస్యం అయ్యే క్రమంలో హెచ్‌ఐర్ పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో వరహాల నాయుడు( కోశాధికారి) నర్సీపట్నం , గోవింద్ ( ట్రెజరర్), పాయకరావుపేట రమణాజీ ( మునగపాక ), లక్ష్మి, (కసింకోట ) కృష్ణ, (కోటవుట్ల). అనకాపల్లి జిల్లా పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** గ్రామ పంచాయతీల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుత సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి ముగియనుంది. గడువులోగా ఎన్నికల నిర్వహణకు కీలకమైన ఓటర్ల జాబితాల రూపకల్పన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) జిల్లా పంచాయతీ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. అయితే ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. జిల్లా పంచాయతీ అధికారులు ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల తయారీపై కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 24 మండలాల్లో 646 గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల జాబితాల రూపకల్పనపై సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల పంచాయతీల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా 31 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. అయితే ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపినా ఆమోదం తెలుపుతూ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 646 గ్రామ పంచాయతీల పరిధిలోని వార్డుల వారీగా ఫొటోలతో ఓటరు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో 14,94,947 మంది జనాభా ఉండగా, 2026 జనవరి 1వ తేదీ నాటికి జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితా ఆధారంగా గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాలు రూపొందించనున్నారు. జిల్లాలో 2024లో సార్వత్రిక ఎన్నికల నాటికి ఎస్‌ఈసీ ప్రకటించిన జాబితా ప్రకారం జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,73,591 మంది ఓటర్లు ఉన్నారు. 2025 జనవరిలో ఎస్‌ఈసీ ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం 12,91,044 మంది ఉన్నారు. గత ఏడాది 17,453 మంది ఓటర్లు పెరిగారు. ఈ ఏడాది మరో 15 వేల పైచిలుకు ఓటర్లు పెరగనున్నారని అంచనా వేస్తున్నారు. ఇంకా 2026 ఓటర్ల జాబితా అధికారికంగా ప్రకటించాల్సి వుంది. ఈ నెల 9వ తేదీన ఓటర్ల జాబితా ప్రకటన అనంతరం పంచాయతీల పరిధిలో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాలు రూపొందించనున్నారు. ఎన్నికల సంకేతాలు రావడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరోవైపు గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్‌ల ఖరారుపై కూడా కసరత్తు జరుగుతోంది. ఓటర్ల జాబితాల రూపకల్పనకు సంబంధించి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేస్తుందని, దాని ఆధారంగా గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు రూపొందించి ముసాయిదా జాబితాలను పంచాయతీ కేంద్రాల్లో ప్రకటిస్తామని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ తెలిపారు. 2026 జనవరి 1 నాటికి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీల్లో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తామన్నారు. అయితే ఈ ప్రక్రియ జరిపేందుకు ఎస్‌ఈసీ నుంచి ఇంకా షెడ్యూల్ విడుదల కావాల్సి ఉందని తెలిపారు.

## ప్రభుత్వ ఈఎస్ఐ హాస్పిటల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే గణబాబు



**మల్కాపురం, పతాకం న్యూస్:** సింధియా న్యూ కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఈ.ఎస్.ఐ హాస్పిటల్‌ను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు సోమవారం పరిశీలించారు. హాస్పిటల్ పరిశుభ్రతను పరిశీలించి సందర్శకులను సమస్యలపై ఆరా తీసి అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ నందు వ్యర్థాల విభజన విధానాన్ని పరిశీలించి, వివిధ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను మరియు ఓపి పేషెంట్స్ ను పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు అనంతరం హాస్పిటల్ అభివృధి మరియు పనితీరు పై సమీక్షించారు. ప్రాణాంతక క్యాన్సర్ బారినపడిన. ఖరీదైన వైద్యం చేయించుకోలేక దినదిన గండంగా బతుకీడుస్తున్న పేదల ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5 & 2 లక్షల ఖరీదు చేసే ఇంజక్షన్స్ సుమారు 96 పేషెంట్లకు 2.9 కోట్ల విలువగల ఇంజక్షన్లు ఉచితంగా ఈ కూటమి ప్రభుత్వంలో ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఈ.ఎస్.ఐ సూపరిండెంట్ ఫణీంద్ర, ఆర్.ఎం.వో శ్రీధర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంటాను మర్యాదపూర్వకంగా కలిసిన సింహాచలం ఈఓ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన జె. వెంకట్రావు సోమవారం ఎంవీపీ కాలనీలోని నివాసంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. సింహాచలం దేవస్థానం అభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళిక సిద్ధం చేయాలని ఈ సందర్భంగా గంటా పేర్కొన్నారు. ఏప్రిల్ 20 న జరగబోయే స్వామి వారి చందనోత్సవంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదపండితులు మంత్రోర్చనలతో ఎమ్మెల్యే ను ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నికలు జడ్పీ సమావేశ మందిరంలో జరిగాయి. అధ్యక్షుడిగా ఎస్.సత్తిబాబు (విశాఖ ప్రాజెక్టు డివిజన్ సూపరింటెండెంట్), ప్రధాన కార్యదర్శిగా డీవీ సీతారామరాజు (నక్కపల్లి మండల పరిషత్ ఏవో), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎల్.పూర్ణయ్య (పెదబయలు మండల పరిషత్ ఏవో), ఉపాధ్యక్షుడిగా ఆర్వీ నాగరాజు (జడ్పీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్), డీవీఎస్ గౌరీపతిరావు (చోడవరం పీఆర్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్), పి.శ్రీనివాసు (రోలుగుంట మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్) ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జి.గంగాధరరావు (కొత్తకోట జడ్పీ పాఠశాల జూనియర్ అసిస్టెంట్), ఎస్.త్రినాథరావు (సబ్బవరం మండల పరిషత్ ఏవో), సీహెచ్ సింహాచలం (మాడుగుల మండల పరిషత్ టైపిస్టు), జీఎల్ నరసింహారావు (అనకాపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ జూనియర్ అసిస్టెంట్), సంయుక్త కార్యదర్శులుగా పి.రామకృష్ణ (జడ్పీలో సీనియర్ అసిస్టెంట్), ఎంవీహెచ్‌ఆర్ స్వామి (రావికమతం మండల పరిషత్ ఏవో), వై.రామకృష్ణ (నర్సీపట్నం మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్), కార్యనిర్వాహక కార్యదర్శులుగా జి.సుధారాణి (కె.కోటపాడు పీఆర్ సబ్‌డివిజన్ ఏవో), డీవీ రమణరాజు (రాంబిల్లి మండల పరిషత్ ఏవో), ఎస్.రవికుమార్ (భీమిలి మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్), బీవీఎస్ ఫణికుమార్ (దేశపాత్రునిపాలెం హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా విజయనగరం జిల్లా సంఘం అధ్యక్షుడు సీహెచ్ మురళి వ్యవహరించారు.

## చేతి బోర్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో చేతి బోర్ల మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు సమ్మర్ క్రాష్ కార్యక్రమంలో భాగంగా నీటి పథకాలు, చేతి బోర్లు తనిఖీ చేయాలి. ఇందుకోసం ప్రత్యేకంగా మొబైల్ టీమ్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చేతి బోర్లు 15,938 ఉన్నాయి. ఇంకా 10 వేల లీటర్ల లోపు నిల్వ సామర్థ్యం ఉన్న నీటి పథకాలు 767, 20 వేల లీటర్లకుపైబడి సామర్థ్యం ఉన్న నీటి పథకాలు పథకాలు 1083, డైరెక్ట్ పంపింగ్ పథకాలు 91, సంపులలోకి నీటిని నింపి గ్రామాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా సరఫరా చేసే పథకాలు 10 ఉన్నాయి. ఆయా మొబైల్ టీమ్‌లు నిర్ణీత గడువు.. మార్చి 15వ తేదీలోగా బోర్లుతోపాటు ఈ పథకాలను తనిఖీ చేయాలి. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు వారం రోజుల వ్యవధిలో 1,888 చేతి బోర్లను తనిఖీ చేశారు. వీటిలో 1,823 బోర్లు పని చేస్తుండగా 48 బోర్లు పని చేయడం లేదని గుర్తించారు. ఒకటి మినహా మిగిలిన వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇక 10 వేల లీటర్ల లోపు సామర్థ్యంగల నీటి పథకాల్లో 107 ట్యాంకులను తనిఖీ చేసి, అన్నీ పని చేస్తున్నట్టు నిర్ధారించారు. . 20 వేల లీటర్లకుపైబడి సామర్థ్యంగల నీటి పథకాలల్లో 140 పథకాలు, డైరెక్ట్ పంపింగ్ పథకాలు, సంపుల్లోకి నీటిని నింపి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పథకాన్నీ వినియోగంలో ఉన్నట్టు గుర్తించారు. కాగా బోర్లు, నీటి పథకాల మరమ్మతుల ఖర్చులను మండల పరిషత్ కార్యాలయాల 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగిస్తున్నారు. పలు మండలాల అధికారులు బోర్లు మరమ్మతులకు అవసరమైన సామగ్రిని ఇప్పటికే కొనుగోలు చేయగా, మిగిలిన మండలాల అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు.

## 28న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ సర్వసభ్య సమావేశం ఈనెల 28న నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు నిర్ణయించారు. ఈ మేరకు అజెండా సిద్ధం చేసి, ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రస్తుత కార్యవర్గం ఐదేళ్ల పదవీకాలం వచ్చేనెల 17తో ముగుస్తుంది. దానికి పదిరోజులు ముందు ఎలాంటి సమావేశాలు నిర్వహించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో 28న జరిగే సమావేశమే ప్రస్తుత కార్యవర్గానికి చివరిది. ఈ నేపథ్యంలో అజెండాలో భారీగా అంశాలను చేర్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## రోడ్ల నిర్మాణం వెంటనే పూర్తి కావాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా నిర్మించతలపెట్టిన రోడ్లను త్వరితగతిన పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, వీఎంఆర్‌డీఏ అధికారులతో కలిసి పెందుర్తి, వేపగుంట, జుత్తాడ, పినగాడి వరకు ఉన్న అనుసంధాన రోడ్లను ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో సమస్యలుంటే సంబందిత విభాగాల అధికారులతో సంప్రదింపులు జరిపి, సత్వరం పనులు పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సీసీపీ ఎ.ప్రభాకరరావు, చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజు, ఎస్‌ఈ కె.శ్రీనివాసరావు తదితరులున్నారు.

## సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య



**అన్నమయ్య, పతాకం న్యూస్:** : అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో సచివాలయ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మండలంలోని 1వ సచివాలయానికి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం స్థానిక బైపాస్ రోడ్ లోని తన ఇంటిలో సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి స్వస్థలం రామసముద్రం. ఇటీవల బదిలీల్లో భాగంగా బి.కొత్తకోటకు వచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఘటనా స్థలానికి చేరుకొని బి.కొత్తకోట పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం




**అనకాపల్లి, పతాకం న్యూస్:** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల పోరాటం విజయవంతమైందని, మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగశేషు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన అభినందనం సభలో మాట్లాడుతూ, యూనియన్ సుదీర్ఘ పోరాటం, గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు చేపట్టిన 42 రోజుల సమ్మె ఒప్పందాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మినీ అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి, అందులోని పనిచేసే వారికి ప్రమోషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పిల్లల సంరక్షణలో తీవ్ర పని ఒత్తిడితో పనిచేసే మినీ వర్కర్లుకు పోరాట విజయంతో ఉపశమనం లభించిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు వివి శ్రీనివాసరావు, ఆర్ శంకరరావు పోరాటంతో విజయం దక్కించుకున్న మినీ అంగన్వాడీలను అభినందించారు. కార్యక్రమంలో మినీ వర్కర్స్ నాయకులు రామలక్ష్మి, రమణి, శసికళ, సుజాత పాల్గొన్నారు.

## పలు ఎత్తిపోతల పథకాలకు పరిపాలనా అనుమతుల కోసం నిరీక్షణ!



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** మెళియాపుట్టి మండలంలోని కొసమాళ, వసుంధర, రట్టిణి, నడసందర గ్రామాల్లో రైతులకు సాగునీటి ఇబ్బందులు తీర్చేలా.. టీడీపీ ప్రభుత్వ హయాంలో మహేంద్రతనయ నదిలో ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని భావించారు. సుమారు నాలుగు పథకాలకు సంబంధించి 1,383 ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు 2018లో సర్వే చేసి.. అంచనాలు సైతం సిద్ధం చేశారు. కానీ, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వం మారి.. వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రణాళికలు బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలపై దృష్టి సారించింది. వీటిద్వారా సాగునీరందించేలా నిధులు మంజూరు చేస్తుండడంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. దీనిపై పరిపాలనా అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. టెక్కలిలో రైతులకు సంబంధించి వంశధార కాలువపై ఆదిఆంధ్రా కాలనీ వద్ద ఎత్తిపోతలు పథకం నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు రూపొందించారు. రూ.858 లక్షల అంచనాలతో సుమారు 576 ఎకరాలుకు సాగునీరు అందివ్వటానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటికి పరిపాలనా అనుమతి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. .. ఇలా జిల్లాలో పలు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పరిపాలనా అనుమతి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. పరిపాలన అనుమతులు రాక గత ఎనిమిదేళ్ల నుంచి 8 ఎత్తిపోతలు పథకాల పనులు నిలిచిపోయాయి. 11,037 ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.5562.23 లక్షలతో 8 ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. ఏళ్ల తరబడి పనులు ప్రారంభించని కారణంగా గతంలో వీటిని రద్దు చేశారు. మళ్లీ వీటికి పరిపాలనా అనుమతి కోసం కూటమి ప్రభుత్వానికి పంపినట్టు అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు పాతపట్నంలోని సీది, పొందూరు మండలంలోని లోలుగు, తోలాపితోపాటు సింగూరు పురం, కొరగాం, తిమ్మాపురం తదితర ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అనుమతులు కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 41 ఎత్తిపోతల పథకాల ద్వారా 37,255 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి కోసం పైసా కూడా నిధులు ఖర్చు చేయలేదు. ఎత్తిపోతల పథకాలకు కనీస నిర్వహణ కూడా చేపట్టలేదు. పలుచోట్ల మోటార్లకు సంబంధించి రాగిని దొంగలు పట్టుకుపోవడంతో మూడేళ్లపాటు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. వ్యవసాయశాఖ మంత్రి చొరవతో ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. వాటి ద్వారా పనులు చేపట్టి.. సాగునీటి ఇబ్బందులు తీర్చారు. సారవకోట మండలంలో బొంతు ఎత్తిపోతల పథకంతోపాటు గార మండలం కళింగపట్నం, పొందూరు మండలం తండ్యాం తదితర ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలకు నిధులు విడుదల చేశారు. వీటిపనులు చివరి దశలో ఉన్నాయి. అలాగే కొత్త ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పరిపాలన అనుమతులు కూడా మంజూరైతే.. తమకు సాగునీటి కష్టాలు తప్పనున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ప్రతి కార్యకర్తకు బీమా సౌకర్యం



**కొత్తవలస, పతాకం న్యూస్:** ఆపదలో ఆదుకునేందుకు టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా ఉన్న ప్రతి ఒక్కరికి బీమాసౌకర్యం కల్పిం చినట్లు శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మండలంలోని చిన్నిపాలెం గ్రామానికి చెందిన వనుము ఈశ్వరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. ఈశ్వరరావు టీడీపీలో క్రియాశీలక సభ్యత్వం కలిగిఉండడంతో పార్టీ క్రియాశీలక కార్యకర్తలకు పెట్టిన బీమా పథకం కింద ఐదు లక్షల రూపాయలు మంజూర య్యాయి. ఈమేరకు ఈశ్వరరావు కుటుంబ సభ్యులకు కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులు చిన్నిపాలెం గ్రామానికి వెళ్లి అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, ఐటీశాఖ మంత్రి తమ పార్టీలో ఉన్న కార్యకర్తలను ఆదుకునే ధ్యేయంతో ప్రతి క్రియాశీలక కార్యకర్త కోసం బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పీవీ రత్నాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ, టీడీపీ నాయకులు నక్కరాజు చినరాము, గొంపదుర్గా ఉమేష్, సీముసురు పైడిరాజు, వీవీసత్యం, వి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు

**రాజాం, పతాకం న్యూస్:** ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసు కుంటానని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ హామీఇ చ్చారు. రాజాం టీడీపీ కార్యాల యంలో రాష్ట్ర ఉద్యోగుల సం ఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనా రాయణ ఆదేశాల మేరకు సం ఘం తరుపున జిల్లా అధ్యక్షులు పవ్వల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బలివాడ బాలభాస్కర రావు తదితరులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు లెంక సత్తిబాబు, సహాయ కార్యదర్శి గిడిజాల లక్షున్నాయుడు, ఏపీజీఈఏ చీపురుపల్లి తాలూకా అధ్యక్షులు హరి, నాయకులు విశ్వేశ్వర మాస్టారు, ఆత్తి వెంకటమ్మ, బి.యశోద పాల్గొన్నారు.

## మహేంద్రతనయ నదీ జలాల్లో కాలుష్యాన్ని అడ్డుకోవాలి



**పాతపట్నం, పతాకం న్యూస్:** మండలంలోని అనేక గ్రామాలకు తాగునీటి వనరుగా ఉన్న మహేంద్ర తనయ నదీ జలాలు కాలుష్యం కాకుండా చూడాలని మండల సభ్యులు ముక్తకంఠంతో కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ కొండాల యరకయ్య, సర్పంచ్ పడాల షణ్ముఖరావు తదితర సభ్యులు మాట్లాడుతూ.. పర్లాకిమిడి(ఒడిశా) నుంచి అత్యధిక శాతం మురుగునీరు, వ్యర్థాలు మహేంద్ర తనయనదిలో కలుస్తుండడంతో నీరు కలుషితం అవుతుందన్నారు. దీనికితోడు ఇటీవల పర్లాకిమిడిలో కొత్తగా నిర్మిస్తున్న మురుగు కాలువలను నేరుగా మహేంద్ర తనయ నదికి కలుపుతున్నారని, ఈ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. దీనిపై ఇరిగేషన్‌శాఖ అధికారులు మాట్లా డుతూ.. ఇప్పటికే కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టిలో పెట్టిన ట్లు తెలిపారు. అభివృద్ధి పనుల శిలాఫలకాల్లో సర్పంచ్‌ల పేర్లు ఎందుకు పెట్టడం లేదని ఎంపీ టీసీ పోలాకి రేణుకతో పాటు పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. దీనిపై ఎంపీడీవో రమ ణమూర్తి స్పందిస్తూ.. ఇకనుంచి ఆ విధంగా జరగ కుండా చర్యలు చేపడతాపని హామీఇచ్చారు. గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని, వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవా లని సభ్యులు కోరారు. ఈ సమావేశంలో తహసీ ల్దార్ నందిగామ ప్రసాదరావు, వివిధ శాఖల అధి కారులు, సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంత సహజ వనరులపై కార్పొరేట్ శక్తుల కన్ను



**చింతపల్లి, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంత సహజ వనరులపై కార్పొరేట్ శక్తుల కన్నుపడిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. లంబసింగి, తాజంగిలో ఆయన పర్యటించారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గిరిజన ప్రాంత సంపదను కార్పొరేట్ సంస్థలు దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. గిరిజన ప్రాంత సంపదను దోచుకోవాలనే లక్ష్యంతో రూ.వేల కోట్లు ఖర్చు చేస్తూ జాతీయ రహదారులను ప్రభుత్వాలు నిర్మిస్తున్నాయని ఆయన ఆరోపించారు. హోం స్టే పేరిట ఓయో సంస్థకు అప్పగిస్తే ఆదివాసీలకు కలిగే ప్రయోజనం శూన్యమన్నారు. ఐటీడీఏకు హోం స్టే, పర్యాటక ప్రాంతాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే ఆదివాసీలకు మేలు జరుగుతుందన్నారు. ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాసన సభ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కాఫీ ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులకు భరోసాగా నిలవాలన్నారు. కాఫీ బెర్రీ బోరర్ కీటకం ఆశించిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, కార్యవర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, మండల నాయకుడు సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

## గ్రీన్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

**మునగపాక, పతాకం న్యూస్:** గ్రీన్ క్లబ్ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకం అని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త దొడ్డి కోటేశ్వరరావు, ఎపి రాష్ట్ర జీవ వైవిధ్య సంరక్షణ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. మండలంలోని తోటాడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మరిడిమాంబ ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవరాశి మనుగడకు చెట్లు జీవనాధారమని, స్వచ్ఛమైన గాలి, వర్షపాతం, ఆరోగ్యకరమైన పర్యావరణానికి వృక్షాలు ఎంతో దోహదపడతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యనియంత్రణకు మొక్కల నాటివాటిని సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరూ చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రీన్స్ క్లబ్ సేవలను అభినందించారు. అనంతరం గ్రీన్ క్లబ్ సభ్యులు దొడ్డి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, పోలమరాశెట్టి నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ గౌరవ సలహాదారు బీరా వినోద్ కుమార్, అనిత, కే నీల వేణి, బి శాస సాయి, ఉప్పల వెంకటరాజు, నరాల శెట్టి సత్తిబాబు, జి రంజిత, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి కృషి: ఎంపీ కలిశెట్టి



**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్ప లనాయుడు అన్నారు. గెడ్డకంచరాంలో రామదేవుని సంబరాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి సమ స్యలను అడిగి తెలుసుకు న్నారు. విజన్ ఉన్న నాయకుడు, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. 2047 వికసిత్ రాష్ట్రంగా తీర్చిదిద్దే సంకల్పం తో ముందుకు వెళుతున్నారన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అన్నారు. పార్టీకోసం కష్టపడిన వారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్క కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అద్యక్షుడు కుమరాపు రవికుమా ర్, పీఏసీఎస్ అధ్యక్షుడు నక్క మురళి, కూటమి నేతలు బగ్గు జ్ఞానేశ్వరరావు, పంచిరెడ్డి శ్యామల రావు, మీసాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం, ఎరువుల అక్రమ రవాణాపై విజిలెన్స్ నిఘా



**హిరమండలం, పతాకం న్యూస్:** రేషన్ బియ్యం, ఎరువుల అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టారు. మండలంలో పలు చోట్ల లారీలు, ఆటోలు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. తురకపేట గ్రామా నికి చెందిన గెంబలి శ్రీనివాసరావు రూ.43,225 విలువ చేసే 9.50 క్వింటాల రేషన్ బియ్యాన్ని ఒడిశా రాష్ట్రం సీతపురానికి వ్యాన్‌లో తరలిస్తుండగా విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు, సిబ్బంది పట్టుకున్నారు. నివగాం గ్రామానికి చెందిన నాగరాజు హడ్డుబంగిలోని వట్టి సింహాచలం కిరాణా దుకాణం నుంచి బొలోరో వాహనంలో రూ.1,30,527 విలువ చేసే 60 యూరియా బస్తాలను తరలిస్తుం డగా పట్టుకున్నారు. ఈ యూరియా బస్తాలు ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన పిసిని రామకృష్ణకు పంపిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. రేషన్ బియ్యం, యూరియా స్వాధీనం చేసుకొని రెండు వాహనాలను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో వ్యవసాయ అధికారి సంధ్య,సివిల్ సప్లయి డీటీ సీహెచ్ భీమారావు పాల్గొన్నారు.

## భూసేకరణ బాధితులకు న్యాయం చేయాలని వినతి

**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లాలో అక్రమంగా సాగుతున్న బలవంతపు భూసేకరణతో రైతులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడలకు ఎపి రైతు కూలీ సంఘంకార్యదర్శి కోన మోహన్ తదితరులు కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.బుచ్చయ్యపేట మండలం ఆర్.శివరాంపురం, ఆర్.భీమవరం, మల్లాం, లూలూరు, నిమ్మలోవ పంచాయతీల్లోని 10 గ్రామాల్లో ఎపిఐఐసి ఆధ్వర్యంలో పరిశ్రమల ఏర్పాటు పేరుతో 2,525 ఎకరాల భూములను సేకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాగే జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో ప్రతి నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్క్ ఏర్పాటు పేరుతో వందలాది ఎకరాలను కార్పొరేట్ల కోసం కారుచౌకగా కట్టపెట్టేందుకు బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తోందన్నారు. ప్రజలంతా భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగుతోందన్నారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం నిర్వాసితులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, భూసేకరణ కోసం బలవంతంగా ఎంజాయ్మెంట్ సర్వేలను చేస్తున్నారని, ప్రభుత్వం భూ సేకరణ చేపడుతున్న డి-పట్టా, బంజరు భూములపై సాగుదారులకు ఎటువంటి హక్కులు లేవన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్,రెవెన్యూ అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తూ, బలవంతపు భూసేకరణకు యత్నిస్తునఆనరన్నారు. దీనిపై ఆందోళనలు, నిరసనలు తెలియజేస్తూ పోరాడుతున్నారని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు

## సైబర్ నేరగాళ్లపై ఉక్కు పాదం.. రూ. 65 కోట్ల లావాదేవీల గుట్టు రట్టు




**హైదరాబాద్, పతాకం న్యూస్:** ప్రజల నుంచి వివిధ మార్గాల్లో అక్రమంగా నగదు చోరీ చేస్తున్న సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి అంటే.. జనవరి నుంచి నగర పోలీసులు ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టారు. ఈ నేరాలకు పాల్పడుతున్న ఏడు రాష్ట్రాలకు చెందిన 37 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 26 కీలక సైబర్ క్రైమ్ కేసులను పోలీసులు ఛేదించారు. ఒక్క జనవరిలోనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో 117 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆ జాబితాలో ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు 15, డిజిటల్ అరెస్ట్ 2, సోషల్ మీడియా 4, బిజినెస్, గేమింగ్, జాబ్ ఫ్రాడ్స్‌కు సంబంధించి 5 కేసులు ఉన్నాయి. ఇక నగర పోలీసుల సత్వర చర్యలతో రూ.71.91 లక్షల రిఫండ్‌ను బాధితులకు అందజేశారు. ఈ ఆపరేషన్ ద్వారా రూ.65 కోట్ల లావాదేవీల గుట్టురట్టు అయినట్లు సమాచారం. అలాగే సైబర్ క్రైమ్ కేసుల్లో అరెస్టయిన నిందితులకు దేశవ్యాప్తంగా 85 కేసులతో సంబంధముందని నగర పోలీసులు గుర్తించారు. అంటే నిందితుల బ్యాంక్ ఖాతాల్లో రూ.65 కోట్ల మేర భారీ లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి 26 మొబైల్ ఫోన్లు, 79 సిమ్ కార్డులు, 62 డెబిట్ కార్డులు, 57 చెక్ బుక్స్‌తోపాటు భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకుని పోలీసులు సీజ్ చేశారు. ఈ సైబర్ ఆపరేషన్‌లో కీలకమైన మ్యాట్రిమోనీ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసును సైతం నగర పోలీసులు ఛేదించారు. యూకే ఇంజనీర్‌గా నటించి బాధితుడి నుంచి రూ.11.20 లక్షలు మహిళా నిందితురాలు కొట్టేసినట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు జనవరిలో సీ మిత్ర ద్వారా 315 ఎఫ్ఐఆర్‌లు పోలీసులు నమోదు చేశారు. మరో 13 మంది నిందితుల అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి రూ.10.65 లక్షలను హైదరాబాద్ నగర పోలీసులు రికవరీ చేశారు.

## భూములు కాపాడుకోవడానికి ముందుకు రావాలి



**భోగాపురం, పతాకం న్యూస్:** భూములను కాపాడుకోవడమే లక్ష్యంగా అందరు ముందుకు రావాలని నాలుగు గ్రామాల రైతులు నిర్ణయిం చారు. భూములు పోకుండా ఉండాలంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి సిద్ధం కావాలని స్పష్టంచేశారు. మండలంలోని నందిగాంలో నందిగాం, కొటభోగాపురం,శింగవరం, నాతవలసకు చెందిన రైతులు సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములు చేజారకుం డా ఉండడానికి అధికారులు, నాయకులకు వినతులు ఇస్తున్నా పరిశీలనలు ఆగడంలేదని వినతులు పట్టించుకోనే దాఖలాలు కనిపించడంలేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు పేరుతో భూములు జోలికి రాకుండా ఉండాలంటే న్యాయస్థానమే దిక్కుఅన్నారు. కార్యక్రమంలో రైతులు మురళీమోహనరా వు, ఏఎంసీ డైరెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ నిరాహార దీక్ష



**కాకినాడ, పతాకం న్యూస్:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ .... సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్ లోవరాజు, ఎం.గంగా సూరిబాబు సంయుక్తంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేస్తామని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని ఆరోపించారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ యువగళం పాద యాత్రలో విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తాం, ఎటువంటి ఇబ్బందులు విద్యార్థులకు లేకుండా చేస్తామని చెప్పి ఇప్పుడు ఆ మాట ఏం చేశారని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రూ. 7 వేల కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్ లో ఉందని, ఈ పెండింగ్ బకాయిలు విడుదల చెయ్యక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు కట్టకపోతే ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను మిడ్, సెమిస్టర్ పరీక్షలకు హాజరవ్వనివ్వడం లేదని, ఫీజు కట్టిన వారికే హాల్ టికెట్స్ మంజూరు చేస్తామని విద్యార్థులను యాజమాన్యాలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరహార దీక్షకు ప్రజా సంఘాల నాయకులు, ఎస్.ఎఫ్.ఐ మాజీ నాయకులు మద్దతు తెలిపారు. ముందుగా సిఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీ రాణి మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చెయ్యకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఎస్.ఎఫ్.ఐ మాజీ నాయకులు పలివెల వీరబాబు మాట్లాడుతూ చరిత్రలో నిరహార దీక్షకు చాలా ప్రాముఖ్యత ఉందని నిరహార దీక్షలతో స్వతంత్రం వంటి ఎన్నో విషయాలను సాధించామని గుర్తుచేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రెడ్డి మాట్లాడుతూ ఎస్.ఎఫ్.ఐ సభ్యులు పోరాటాలతో చాలా సమస్యలు పరిష్కారం చేసుకున్నారన్నారు. ఈ నిరహార దీక్షను సిఐటీయూ జిల్లా నాయకులు రాజ్ కుమార్, మలక వెంకటరమణ, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రెడ్డి, ఏపీ.ఆర్.పీ.ఏ నాయకులు పూల దండలు వేసి ప్రారంభించారు.

# ఏపీలో ఊపందుకున్న సాగునీటి ప్రాజెక్టులు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 18 నెలల్లోనే సాగునీటి రంగంపై ఏకంగా రూ.23,793 కోట్లు ఖర్చు చేశారు. ఏపీలో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అయితే ప్రాధాన్య క్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఇచ్చే ప్రాజెక్టులను మొదట పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో నిధుల కేటాయింపు, ఖర్చు, పర్యవేక్షణ, అవసరమైన సమస్యలను పరిష్కరించి నిర్దిష్ట గడువులోగా సంబంధిత పనులు పూర్తి చేసేవిధంగా ముందుకువెళ్తున్నారు. గత ప్రభుత్వం ఒక్క జలవనరుల శాఖలోనే ఏకంగా రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగులో పెట్టి వెళ్లింది. ఓ వైపు ఈ బిల్లులు చెల్లిస్తూనే మరోవైపు అనేక సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెడుతూ పనుల్లో వేగం సైతం పెంచారు. 2014-19 మధ్య రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఎందుకుంటే ఆ ఐదు సంవత్సరాల్లోనే రూ.11 వేల కోట్ల వరకు నీరు ప్రగతి పనులకు, మరో రూ.50 వేల కోట్లకు పైగా జలవనరుల శాఖకు ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రస్తుతం మళ్లీ ఆ దిశగా పనులు ఊపందుకున్నాయి.

హంద్రీ-నీవా కాలువ రాయలసీమలోని ఉమ్మడి జిల్లాల్లో పరుగులు తీస్తుంది. కృష్ణా వరద జలాలను 738 కిలోమీటర్ల వరకు తీసుకెళ్తుంది. కేవలం 2,200 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఈ కాలువను వెడల్పు చేయడంతో పాటు లైనింగు పనులు సైతం చేసి దాని ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెంచారు. ఈ పనుల కోసం రూ.3,500 కోట్లను ఖర్చు చేశారు. ఈ కాలువ ద్వారా రాయలసీమలోని జిల్లాలకు ఈ సంవత్సరం 43 టీఎంసీలకు పైగా జలాలను విడుదల చేశారు. అందుభాగంగా కుప్పానికి మొదటిసారి నీటిని అందించారు. పునరావాసానికి రూ. వెయ్యి కోట్లు : అదేవిధంగా వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశ పూర్తి చేయాలంటే ఇంకా నిర్మాణ పనులకోసం రూ.2,000 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సిఉంది. అలాగే పునరావాసానికి దాదాపు రూ. వెయ్యి కోట్లు కావాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక టన్నెళ్ల తవ్వకాల్లోని పెండింగు పనులతో పాటు లైనింగు పనుల వేగాన్ని సైతం పెంచారు. హెడ్ రెగ్యులేటర్ పనులను చేస్తున్నారు. 18 నెలల్లో 3,708 మీటర్ల మేర టన్నెల్ లైనింగు పూర్తయింది. ఫీడర్ కాలువ మరమ్మతులు లైనింగు కోసం ఏకంగా రూ.456 కోట్లు విడుదల చేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో వెలిగొండపై ఇప్పటివరకు రూ.571 కోట్లను ఖర్చు చేశారు.

పోలవరం ఎడమ కాలువ పనులు సైతం వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టులో గత వైఎస్సార్సీపీ హయాంలో ఒక్క శాతం పనులు కూడా చేయలేదు. ఓ వైపు ప్రధాన డ్యాం నిర్మిస్తున్నా ఎడమ కాలువ పనులు చేయకపోతే ఎలాంటి ఉపయోగం ఉండదు. ఎన్డీయే ప్రభుత్వంలో రూ.1,226 కోట్లతో కాలువలో వివిధ ప్యాకేజీలకు టెండర్లు పిలిపించి పనుల వేగాన్ని పెంచారు. ఇప్పటివరకు రూ.900 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అలాగే 2024 ఆగస్టు నెలలో తుంగభద్ర ప్రాజెక్టులో 19వ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ప్రాజెక్టుల మరమ్మతుల నిపుణుడు కన్నయ్యనాయుడిని పిలిపించి రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడింది. చివరికి 'జిందాల్' సహకారంతో అక్కడ స్టాప్ లాగ్ గేటును యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. దీంతో నీళ్లు వృథా కాకుండా అడ్డుకోగలిగారు. అక్కడ 33 గేట్ల కాలపరిమితి ముగిసిపోవడంతో కొత్తగా గేట్లు ఏర్పాటు చేసేందుకు రూ.55 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పనులు సైతం ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్సీపీ హయాంలో కాలువ, నది వరద కట్టలకు ఎలాంటి మరమ్మతులు లేవు. ప్రాజెక్టుల నిర్వహణకూ నిధులు కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం ధవళేశ్వరం బ్యారేజి, తుంగభద్ర డ్యాం, శ్రీశైలం రిజర్వాయర్, మైలవరం, గుండ్లకమ్మ, సోమశిల, గోరకల్లు, కండలేరు, అవుకు వంటి ప్రాజెక్టుల మరమ్మతులకు తొలి విడతగా రూ.610 కోట్లతో పనులు చేపట్టింది.అదేవిధంగా కాలువల పూడిక తీత, కాలువల లాకులు, నిర్వహణ, ఇతర నిర్మాణాల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించి గడిచిన 2 సంవత్సరాల్లో 11,359 పనులకు రూ.878 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.400 కోట్లను సైతం వరకు ఖర్చు చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పనులకు జాతీయ హరిత ట్రైబ్యునల్ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ ఇబ్బందులు తొలిగాయి.

## 'ఎంబియు'లో అడగడుగునా అక్రమాలే.. ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తుంది..

**తిరుపతి, పతాకం న్యూస్:** సేవా నిరతి పేరుతో విద్యా సంస్థలను నడుపుతున్న మోహన్‌బాబు యూనివర్సిటీ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఫీజుల విషయంలో విద్యార్థులను జలగల్లా పీక్కుతింటోంది. దీనిపై ప్రశ్నిస్తే బౌన్సర్లతో భౌతికదాడులకు దిగుతోంది. దీంతో, తల్లిదండ్రులు యాజమాన్యాన్ని అడగాలంటేనే భయపడే పరిస్థితి. తాజాగా మోహన్‌బాబు యూనివర్సిటీ అక్రమాలపై ప్రశ్నించినందుకు ఎస్ఎఫ్ఐ జిల్లా నేతలు అలీ అక్బర్, వినోద్ కుమార్‌లను కిడ్నాప్ చేసి, హత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. అక్రమంగా వసూలు చేసిన రూ.26 కోట్లను విద్యార్థులకు చెల్లించాలని స్వయానా ఆంధ్రప్రదేశ్ ఫీజు రెగ్యులార్టీ మానిటరింగ్ కమిటీ, ఉన్నత విద్యామండలి ఆదేశించినా యూనివర్సిటీ యాజమాన్యం బేఖాతర్ చేయడం గమనార్హం.



శ్రీ విద్యానికేతన్ ట్రస్టు పేరుతో విద్యా సంస్థను నడుపుతున్నట్లు మోహన్‌బాబు డీమ్డ్ యూనివర్సిటీ రిజిస్టర్ చేసుకుంది. రికార్డుల్లో ఫీజులు తీసుకోనట్లుగా, సేవాభావంతో నడుపుతున్నట్టుగా చూపుతున్నారు. ఇంజనీరింగ్, ఎంబిఎ, డిగ్రీ, సిబిఎస్ఇ విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలో బందార్లపల్లి, రామిరెడ్డిపల్లి, నాగయ్యగారిపల్లి పంచాయతీలకు ట్రస్టు పేరుతో దాదాపు 25 ఏళ్లుగా పన్నులు ఎగ్గొడుతూ వచ్చారు. భూములను సైతం కారుచౌకగా, అక్రమంగా కొందరి నుంచి దౌర్జన్యంగా లాక్కున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం సమగ్ర సర్వే చేస్తే అక్రమ భూముల వ్యవహారం బయటకు వస్తుందని ఆ ప్రాంత రైతులు అంటున్నారు.

విద్యార్థి అనారోగ్యం, ఇతర కారణాల వల్ల కళాశాలకు రాలేకపోయినా, సకాలంలో ఫీజు చెల్లించకపోయినా రోజుకు రూ.500 చొప్పున ఫైన్ చెల్లించాల్సిందే. డే స్కాలర్స్ సైతం ఏడాదికి రూ.20 వేలు మెస్‌ఫీజు చెల్లించాలి. మెస్‌లో భోజనం సరిగ్గా లేకపోతే క్యాంపస్‌లో నిర్వహిస్తున్న మోహన్‌బాబు క్యాంటిన్‌లో డబ్బు చెల్లించి తినాలి. పైగా, మెస్‌లో తినకపోతే రోజుకు రూ.100 ఫైన్ కట్టాల్సిందే. విద్యార్థి పొరబాటున సెల్‌ఫోన్ తీసుకొస్తే రూ.500 ఫైన్. యూనిఫాంకు ఏడాదికి రూ.10 వేలు చెల్లించాలి. రెండు ఫ్యాంట్లు, మూడు టీ షర్టులు ఇస్తారు. క్యాంపస్‌లో హాస్టల్ ఖాళీ లేకపోతే ఎదురుగా ఉన్న ప్రైవేట్ పీజీ హాస్టళ్లలో చేరాలంటే యాజమాన్యం అనుమతి తప్పనిసరి. సంబంధిత హాస్టల్‌కు అందుకు సంబంధించిన డబ్బులు చెల్లించాలి. దీనికితోడు ప్రైవేట్ హాస్టళ్లలో చేరేవారి నుంచి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకూ మోహన్‌బాబు విద్యాసంస్థల యాజమాన్యం వసూలు చేస్తోంది. ప్రైవేట్ పీజీ హాస్టళ్లు 60 వరకూ ఉన్నాయి. వీటిని నిర్వహిస్తున్న వారి నుంచి ఏడాదికి లక్షలాది రూపాయలను యాజమాన్యం వసూలు చేసుకుంటోంది. విద్యా సంస్థల ఆవరణలో ఏ చిల్లర అంగడి పెట్టుకోవాలన్నా మోహన్‌బాబు ఫొటోతోపాటు, లక్షల్లో సమర్పించుకోవాల్సిందే. ఎంసెట్‌లో ర్యాంకు సాధించిన వారి నుంచి అదనంగా మిస్లీనియన్స్ పేరుతో రూ.40 వేలు చెల్లించాలి. ఏటా మోహన్‌బాబు పుట్టినరోజు పురస్కరించుకుని మార్చి 19న నిర్వహించే 'మోహన్‌మంత్ర'కు ప్రతి విద్యార్థి రూ.1000 చెల్లించాల్సిందే. 'జాబ్‌మేళా'కు ఒక్కో విద్యార్థి కళాశాలలో రూ.40 వేలు సమర్పించాల్సిందే. ఉన్న మొత్తం 12,700 మంది విద్యార్థులూ ఏదో రూపంలో ఇలాంటివి చెల్లించాల్సిందే. ఫీజుల దందా విషయం బయటపడకుండా యాజమాన్యం పలు జాగ్రత్తలు తీసుకొంటోంది. మోహన్‌బాబు యూనివర్సిటీలో విద్యార్థుల నుంచి అక్రమంగా రూ.26 కోట్లు వసూలు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఫీజు రెగ్యులారిటీ మానిటరింగ్ కమిటీ తేల్చింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపింది. అక్రమంగా వసూలు చేసిన ఆ మొత్తాన్ని తిరిగి విద్యార్థులకు చెల్లించాలని ఆదేశించింది. అక్రమాలు వాస్తవమేనని గుర్తించిన ఉన్నత విద్యామండలి గత ఏడాది అక్టోబర్ ఏడున రూ.15 లక్షలు జరిమానా విధించింది. వీటిపై మోహన్‌బాబు యూనివర్సిటీ హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంది. విద్యార్థి తండ్రి మస్తాన్ మాట్లాడుతూ మోహన్‌బాబు యూనివర్సిటీలో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని.. రెండేళ్ల క్రితం నా కుమారుడు బిటెక్ కోసం ఎంసెట్ మెరిట్ సాధించినా రూ.40 వేలు అదనంగా కట్టించుకున్నారని.. మెస్ పేరుతో రూ.20 వేలు వసూలు చేస్తూ, తినకపోతే రోజుకు రూ.100 ఫైన్ వేశారని.. దీనిని చెల్లించకపోతే 'మిడ్ ఎగ్జామ్'కు అనుమతించబోమని తేల్చి చెప్పారని.. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.

# కాఫీని అధికంగా తాగితే ఏం జరుగుతుంది..?

మనం ఎక్కువగా తీసుకునే పానీయాల్లో కాఫీ ఒకటి. చాలా మంది కాఫీని ఇష్టంగా తాగుతూ ఉంటారు. అలసట నుండి బయటపడడానికి, శరీరానికి ఉత్తేజాన్ని ఇవ్వడానికి కాఫీ ఎంతో సహాయపడుతుంది. కాఫీని తాగడం వల్ల ఒత్తిడి తగ్గి చేసే పనిపై ఏకాగ్రత పెరుగుతుంది. శరీరానికి శక్తిని అందిస్తుంది. ఇలా అనేక రకాలుగా కాఫీ మనకు మేలు చేస్తుందని చెప్పవచ్చు. అయితే కాఫీని తీసుకోవడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలు ఎక్కువవడంతో పాటు కొత్త అనారోగ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కాఫీ తాగడం వల్ల గుండె దడ ఎక్కువయ్యే అవకాశం ఉందని ఇది ఆందోళన స్థాయిలను పెంచుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



కెఫిన్ శరీరం, మనస్సును ఉత్తేజం రుస్తుంది. నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. దీంతో మరింత ఆందోళనకు గురవుతారు. అలాగే ఇప్పటికే ఆందోళన ఉన్నవారు కాఫీని తాగడం వల్ల అది మరింత తీవ్రతరం అవుతుంది. అలాగే జీర్ణ సమస్యలతో ఇబ్బందిపడే వారు, ఆమ్లత్వం సమస్యను ఎదుర్కొనే వారు కాఫీ తాగడం పట్ల జాగ్రత్త వహించాలి. కాఫీ తాగడం వల్ల యాసిడ్ రిఫ్లెక్స్ మరింత ఎక్కువవుతుంది. పేగుల సున్నితత్వం పెరుగుతుంది. ఆహారం జీర్ణమవ్వడం కష్టమవుతుంది. జీర్ణవ్యవస్థతో మొత్తం శరీర ఆరోగ్యం అనుసంధానమై ఉంటుంది కనుక మొత్తం ఆరోగ్యం ప్రభావితమవుతుంది. అదేవిధంగా గర్భిణీలు కూడా కాఫీని తీసుకోకపోవడమే మంచిది అని వైద్యులు చెబుతున్నారు. కెఫిన్ పిండం పెరుగుదలను ప్రభావితం చేస్తుంది. కాఫీ తాగడం వల్ల శిశువు తక్కువ బరువుతో పుట్టడం, గుండె, జననేంద్రియ లోపాలు, న్యూరో సమస్యలు రావడం వంటివి కూడా జరుగుతాయని వైద్యులు తెలియ జేస్తున్నారు. ఇక అధిక రక్తపోటు, గుండె సమస్యలతో బాధపడే వారు కూడా కాఫీని తీసుకోకపోవడమే మంచిదని వారు సూచిస్తున్నారు. కాఫీ తాగడం వల్ల రక్తపోటు మరింత పెరుగుతుంది. కెఫిన్ అడ్రినలిన్ విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది గుండె మరింత వేగంగా కొట్టుకునేలా చేస్తుంది. దీంతో రక్తపోటు కూడా పెరుగుతుందని రక్తనాళాలు కూడా ప్రభావితం అవుతాయని వారు చెబుతున్నారు. ఇవన్నీ కూడా కాలక్రమేణా గుండె సమస్యలకు దారి తీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా కాఫీ తాగడం వల్ల శరీరం ఇన్సులిన్ కు ప్రతిస్పందించే సహజ సామర్థ్యాన్ని కూడా కోల్పోతుందని వారు తెలియజేస్తున్నారు. కనుక మనం తాగే కాఫీ మన శరీరానికి శక్తి ఇచ్చేదిగా ఉండాలే తప్ప అనారోగ్యాన్ని కలిగించేదిగా ఉండ కూడదని వైద్యులు చెబుతున్నారు. కనుక కాఫీ తాగే వారు వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కాఫీని తాగాలా వద్దా అని నిర్ణయించుకోవాలి. అలాగే ఆరోగ్యవంతులు కూడా కాఫీ తాగినప్పటికీ అది మితంగా ఉండేలా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# జుట్టు రాలే సమస్య వేధిస్తోందా?



నేటి కాలంలో చాలా మంది జుట్టు రాలే సమస్యతో బాధపడుతున్నారు. దీనికి కారణాలు ఏంటి? ఈ సమస్యని కంట్రోల్ చేసేందుకు ఏం చేయాలో తెలుసుకోండి. వయసుతో సంబంధం లేకుండా జుట్టు రాలిపోవడం అనే సమస్య చాలా కామన్ అయిపోయింది. ప్రతి ఒక్కరికీ రోజులో కొన్ని వెంట్రుకలు రాలిపోవడం సహజమే. కానీ, ఎక్కువగా జుట్టు రాలుతుందంటే ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి సమస్యకి ఎన్నో కారణాలు ఉన్నట్లుగానే ఈ సమస్యకి కూడా చాలా కారణాలే ఉన్నాయి. అందులో ముఖ్యంగా కొన్ని ఉన్నాయి. అవేంటంటే.. పోషకాహారం మన ఆరోగ్యంతో పాటు మన జుట్టుకి కూడా అవసరమే. జుట్టు పెరగాలన్నా, రాలి పోకుండా ఉండాలన్నా పోషకాహారం ముఖ్యంగా ఐరన్ ఫుడ్స్ చాలా ముఖ్యం. జింక్, విటమిన్ ఏ, విటమిన్ డి ఫుడ్స్ రెగ్యులర్‌గా తీసుకోవాలి. వీటితో పాటు పండ్లు, కూరగాయలు, ప్రోటీన్స్, హోల్ గ్రెయిన్స్, గుడ్లు, నట్స్, చేపలు, పాలకూర వంటి ఫుడ్స్‌ని తీసుకోవడం మంచిది. హైడ్రేటెడ్‌గా ఉండడం కూడా చాలా ముఖ్యం. దీని వల్ల స్కాల్ప్ మాయిశ్చరైజేషన్ అందుతుంది. కాబట్టి, జుట్టు కుదుళ్ళు హెల్దీగా మారతాయి. దీంతో పాటు మంచి సహజ నూనెలతో జుట్టుకి మసాజ్ చేయండి. దీని వల్ల కుదుళ్లకి రక్తప్రసరణ అంది చక్కగా దృఢంగా మారి ఊడిపోకుండా ఉంటాయి. ఎసెన్షియల్ ఆయిల్స్ కూడా హెయిర్ ఫోలికల్స్‌కి రక్త ప్రసరణని చురుగ్గా అందేలా చేస్తాయి. దీని వల్ల జుట్టుకి పోషణ అందుతుంది. కొబ్బరినూనె, బాదం నూనె, ఆలివ్ నూనెతో మసాజ్ చేయండి. వీటితో పాటు లావెండర్, రోజ్‌మేరీ ఆయిల్స్ కూడా కొద్దిగా వేడి తలపై సున్నితంగా మసాజ్ చేయాలి. అరగంట తర్వాత తలస్నానం చేయాలి.అదే విధంగా, అలోవెరా జెల్ అందానికి, ఆరోగ్యానికి మెల్ప్ చేస్తుంది. ఈ జెల్‌ని తలకి రాసి 45 నిమిషాల పాటు తర్వాత మైల్డ్ షాంపూతో క్లీన్ చేయండి.

దీని వల్ల లెవల్స్ బ్యాలెన్స్ అయి హెల్దీ జుట్టు మీ సొంతమవుతుంది. జుట్టు స్ట్రాంగ్‌గా ఉండాలంటే ముందు నుంచి జుట్టుని చక్కగా శుభ్రంగా మెంటెయిన్ చేయాలి. ఇందుకోసం వారానికి రెండు నుంచి మూడు సార్లైనా తలస్నానం చేయాలి. దీంతో పాటు దువ్వెనలని క్లీన్ చేయడం, తలకి వాడే టవల్స్ వంటివాటిని కూడా క్లీన్‌గా ఉంచుకోవాలి. చుండ్రు రాకుండా చూసుకోండి. చాలా మంది తలస్నానం చేశాక జుట్టు త్వరగా ఆరడానికి డ్రైయర్స్ వాడుతుంటారు. అలా కాకుండా సాధ్యమైనంత వరకూ జుట్టు సహజంగానే ఆరిపోయేలా చూడండి. దీని వల్ల జుట్టు హెల్దీగా ఉంటుంది. సరిపడా నిద్ర కూడా జుట్టుపై ప్రభావం చూపిస్తుంది. కాబట్టి, చక్కగా నిద్రపోండి. ఇప్పటి వరకూ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూశాం.

ఇక ఇప్పుడు ఎలాంటి వాటికి దూరంగా ఉండాలో తెలుసుకోండి. మీరు వాడే షాంపూ, కండీషనర్స్, స్టైలింగ్ ప్రొడక్ట్స్ కూడా ఎక్కువ కెమికల్స్ లేకుండా చూసుకోండి. దీని వల్ల జుట్టు ఎక్కువగా రాలుతుంది. కాబట్టి, ముఖ్యంగా సల్ఫేట్ లేని ప్రొడక్ట్స్‌ని వాడండి. స్ట్రెయిటనర్ కర్లింగ్ ఐరన్ వంటి ఎక్కువగా వాడినా జుట్టు రాలుతుంది. అవకాశం ఉంది. కాబట్టి, జుట్టుని ఎక్కువగా వేడి తగలకుండా చూడండి. దీని వల్ల జుట్టు బలహీనంగా మారుతుంది.

జుట్టు రాలిపోవడం వల్ల ఒత్తిడి వస్తే.. ఒత్తిడి కారణంగా కూడా జుట్టు రాలుతుంది. కాబట్టి, ఒత్తిడిని దూరం చేసుకోవాలి.

# ‘ఉపాధి’ పనుల స్పీడ్‌కు బ్రేకులు

## బిల్లుల అప్‌లోడ్‌కు కేంద్ర పోర్టల్‌లో అడ్డంకులు



**అమరావతి, పతాకం న్యూస్:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిమెంట్‌రోడ్లు తదితర మెటీరియల్ పనులు చేపట్టిన వారికి బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఐసీ పోర్టల్ బ్రేకులు వేస్తోంది. ఈ పథకం మార్చి నెలాఖరుకు పూర్తవుతుండటంతో మంజూరైన పనులన్నీ ఆ లోపు చేయాలని అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉపాధి మెటీరియల్ నిధులతో రాష్ట్రంలో చేపట్టిన సిమెంట్‌రోడ్లు, తారురోడ్లు, మినీగోకులాలు పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు డ్రైవ్ చేపట్టారు. కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులందరూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పనులను వేగవంతం చేశారు. అయితే ఈ పథకానికి సంబంధించిన లావాదేవీలన్నీ ఎన్ఐసీ పోర్టల్ ద్వారా జరుగుతున్నాయి. ఈ పోర్టల్‌లో ఎలాంటి సాఫ్ట్‌వేర్ సమస్యలొచ్చినా పనులకు బ్రేకులకు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆఖరులో పనుల వేగం తగ్గించేందుకు సాఫ్ట్‌వేర్‌లో పలు రకాలు అడ్డంకులు సృష్టిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో నడుస్తున్న(ఆన్‌గోయింగ్) పనుల సంఖ్య 20కి మించి ఉండరాదని నిబంధనలు పెట్టింది. దీంతో మెజారిటీ పంచాయతీల్లో కొత్త పనులను ఆన్‌గోయింగ్ వర్క్స్ కిందకు చేర్చుకోలేని పరిసితి ఏర్పడింది. జిల్లాల్లో కలెక్టర్లు మంజూరుచేసిన పనులు సర్పంచులు, వెండర్లు త్వరితగతిన పూర్తి చేసినప్పటికీ వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చెల్లింపులు పొందడంలో వెనకబడతామన్న ఆందోళన పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 34వేల మినీ గోకులాలు మంజూరుచేసి 20 వేలకు పైగా పనులు కూడా ప్రారంభించారు. అయితే, వాటి బిల్లులు అప్‌లోడ్ చేయడంలో సిబ్బందికి పోర్టల్ సహకరించడం లేదు.

ఎన్ఐసీ పోర్టల్‌లో పలు రకాల ఆటంకాలు ఏర్పడ్డాయి. పథకం ముగింపు సమయంలో రాష్ట్రాల్లో అడ్డగోలుగా బిల్లులు అప్‌లోడ్ చేస్తారేమోనన్న యోచనతో కేంద్రం వెబ్‌సైట్ ద్వారా నియంత్రణ ప్రక్రియ చేపట్టింది. దీంతో గ్రామ పంచాయతీల్లో ఉన్న ఆన్‌గోయింగ్ పనుల సంఖ్యను పోర్టల్ 20కి నియంత్రించింది. అంటే ఆన్‌గోయింగ్ కింద 20 లేదా అంతకంటే తక్కువ సంఖ్యలో మాత్రమే పనులు ఉండాలి. అంతకంటే ఎక్కువ పనులను అనుమతించదు. కొత్త పనులు ఇందులో చేర్చాలంటే ఉన్న పనులను తొలగించాల్సి వస్తోంది. కొన్ని పెద్ద పంచాయతీల్లో అధిక సంఖ్యలో పనులు ప్రారంభమైనందున కొత్త పనులు ఆన్‌గోయింగ్ కిందకు తెచ్చే పరిస్థితి లేదు. పోనీ ఈ పనుల జాబితాను తొలగించాలంటే వాటిలో కనీసం 30 శాతం పూర్తి చేసి ఉండాలి. లేకుంటే పోర్టల్ నుంచి తొలగించేందుకు అనుమతించడం లేదు. గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, మినీగోకులాల పనులు పల్లెపండుగ-2 కింద ప్రారంభమయ్యాయి. ఎక్కువ సంఖ్యలో మినీగోకులాలు ఉండటంతో ఈ పనులన్నీ ఆన్‌గోయింగ్ కిందకు పోర్టల్ అనుమతించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈ సమస్యలపై కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సంప్రదిస్తూనే ఉన్నారు. 20 పనుల జాబితాలో రైతుల, ఉద్యానవన పంటల, హౌసింగ్‌కు సంబంధించిన పనులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ తరహా పనులు ఎన్ని ఉన్నా... 20 పనుల లిమిట్ అనే అంశం కిందకు రాదు. అయితే మినీ గోకులాలను మాత్రం ఆ తరహా జాబితాలో చేర్చకపోవడంతో రాష్ట్రంలో పెద్ద సమస్యగా మారింది. పనులు పూర్తిచేసి బిల్లులు చేసుకోలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. మినీ గోకులాలను పోర్టల్‌లో అనుమతించకపోవడంతో తాము నష్టపోతామన్న ఆందోళన రైతుల్లో ఏర్పడింది. ఉన్నతాధికారులు సత్వరమే కేంద్ర అధికారులతో మాట్లాడి బిల్లులు అప్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నోబెల్ గ్రహీత నర్గిస్‌కు జైలు శిక్ష విధించిన ఇరాన్



**ఇరాన్:** ఇరాన్‌లో మహిళల హక్కులు, మానవ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రముఖ కార్యకర్త, 2023 నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నర్గిస్ మొహమ్మదీకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. అక్కడి న్యాయస్థానం ఆమెకు 6 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారన్న ఆరోపణలపై ఈ తీర్పు వెలువరించింది. ఆమె న్యాయవాది మొస్తఫా నిలి ఈ వివరాలు వెల్లడించారు. నేరాలు చేయడానికి సమూహంగా ఏర్పడ్డారన్న అభియోగంపై ఆరేళ్ల జైలు శిక్ష విధించారని తెలిపారు. దీనితో పాటు ప్రభుత్వ వ్యతిరేక ప్రచార కార్యకలాపాలకు సంబంధించి మరో ఒకటిన్నర సంవత్సరాల శిక్ష కూడా పడింది. అయితే, ఇరాన్ చట్టాల ప్రకారం ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలవుతాయి. శిక్షాకాలం పూర్తయ్యాక రెండేళ్ల పాటు దేశం విడిచి వెళ్లరాదని, మరో రెండేళ్ల పాటు సౌత్ ఖొరాసాన్‌లోని ఖోస్ఫ్ నగరంలో బహిష్కరణ శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది.53 ఏళ్ల నర్గిస్ మొహమ్మదీ గత 25 ఏళ్లుగా ఇరాన్‌లో మరణశిక్షకు, మహిళలపై తప్పనిసరి హిజాబ్ నిబంధనకు వ్యతిరేకంగా బలమైన గళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె తన జీవితంలో ఎక్కువ భాగం జైలులోనే గడిపారు. జైలులో ఉండగానే గత ఏడాది ఆమె ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు. ఆమె తరఫున, పారిస్‌లో ఉంటున్న ఆమె కవల పిల్లలు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

అనారోగ్య కారణాలతో గత డిసెంబర్‌లో మూడు వారాల పాటు తాత్కాలికంగా విడుదలైన ఆమెను, తర్వాత మళ్లీ అరెస్టు చేశారు. తాజా తీర్పు ఇంకా తుది కాదని, దీనిపై అప్పీల్ చేస్తామని ఆమె న్యాయవాది తెలిపారు. నర్గిస్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆమెకు బెయిల్ లభిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.




# ఇంగ్లాండ్‌ను వణికించిన నేపాల్



టీ20 ప్రపంచకప్‌లో తొలిరోజు డిఫెండింగ్ చాంపియన్ భారత్‌ను అమెరికా భయపెడితే.. రెండోరోజు పోటీల్లో రెండుసార్లు చాంపియన్ ఇంగ్లండ్‌ను చిట్టిపొట్టి జట్టు నేపాల్ వణికించింది. 185 పరుగుల లక్ష్య ఛేదనలో నేపాల్ ఆఖరి బంతి దాకా పోరాడింది. మ్యాచ్‌లో ఓడినా అద్భుత ప్రదర్శనతో భళా అనిపించింది. మొత్తంగా ఆదివారం అత్యంత ఉత్కంఠగా జరిగిన ఈ గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు నాలుగు పరుగులతో గెలుపొంది ఊపిరి పీల్చుకుంది. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 184/7 స్కోరు చేసింది. జాకబ్ బెతెల్ (35 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 55), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 53) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. విల్ జాక్స్ (18 బంతుల్లో ఒక ఫోర్, 4 సిక్సలతో 39 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. నేపాల్ బౌలర్లలో దీపేంద్ర సింగ్, నందన్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో నేపాల్ 20 ఓవర్లలో 180/6 స్కోరు చేసి ఓడింది. దీపేంద్ర సింగ్ (29 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 44), కెప్టెన్ రోహిత్ పౌడెల్ (34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలతో 39), ఓపెనర్ కుశాల్ బుర్తెల్ (17 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 29) రాణించారు. దీపేంద్ర, రోహిత్ మూడో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. ఇక..ఆఖర్లో లోకేష్ బామ్ (20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలతో 39 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో నేపాల్‌ను విజయం అంచుల దాకా తీసుకొచ్చాడు. చివరి బంతికి ఆరు పరుగులు కావాల్సిన దశలో సింగిలే రావడంతో నేపాల్‌కు ఓటమి తప్పలేదు.

# వైభవ్ సంచలనాలు- సచిన్ రికార్డు బ్రేక్ చేస్తాడా?



వైభవ్ సూర్యవంశీ’. ఏడాది కాలంగా ప్రస్తుత క్రికెట్‌లో దిగ్గజాలైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కంటే ఎక్కువగా వినిపిస్తున్న పేరిది. 14 ఏళ్లకే క్రికెట్ ప్రపంచంలో అడుగుపెట్టిన ఈ చిచ్చరపిడుగు విధ్వంసం సృష్టిస్తున్నాడు. అరంగేట్రం చేసినప్పటి నుంచీ వైభవ్ పేరు క్రికెట్‌లో సంచలనమే. తాజాగా అండర్ 19 వరల్డ్‌కప్‌లోనూ అసామాన ఆట తీరుతో అదరగొట్టాడు. ముఖ్యంగా ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై 175 పరుగులు ఇన్నింగ్స్‌తో ఔరా అనిపించాడు. దీంతో యావత్ ప్రపంచం దృష్టి మరోసారి వైభవ్?పై పడింది.

ఏ క్రికెటర్‌కైనా ఐసీసీ టోర్నీలో పాల్గొనడం, ట్రోఫీ దక్కించుకోవడం అనేది కెరీర్ గోల్. ఈ అవకాశం అందరికీ దక్కదు. కొంతమందికి దక్కినా, ట్రోఫీని నెగ్గడం అంత ఈజీ పని కాదు. కానీ, 14ఏళ్ల వయసులోనే వైభవ్ ఈ ఘనత అందుకున్నాడు. ఐసీసీ టోర్నీలో ఆడడమే కాదు, ట్రోఫీనీ ముద్దాడాడు. జట్టులో అందరిలో ఒకడిగా కాకుండా తన ఆటతో ప్రత్యేకంగా నిలిచాడు. ఓవరాల్‌గా టోర్నీలో 7 మ్యాచ్‌ల్లో 62.71 సగటుతో 439 పరుగులు చేశాడు. దీంతో వైభవ్?కు ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’ అవార్డు దక్కింది. అలా కేవలం 14ఏళ్లకే ప్రతిష్ఠాత్మ ఐసీసీ ట్రోఫీ, ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’ అవార్డు అందుకొని రికార్డులకెక్కాడు ఈ బిహార్ చిన్నోడు.

2025 ఐపీఎల్?లో అరంగేట్రంతో వైభవ్ క్రికెట్ ప్రపంచానికి పరిచయం అయ్యాడు. విపరీతంగా పోటీ ఉండే ఐపీఎల్‌లో గుజరాత్‌పై 35 బంతుల్లోనే సెంచరీ సాధించి ప్రపంచం దృష్టిని తన వైపునకు తిప్పుకున్నాడు. ఐపీఎల్‌లో తన సెంచరీ ఇన్నింగ్స్ గాలివాటం కాదని నిరూపిస్తూ ఆ తర్వాత ఆడిన ప్రతీ టోర్నమెంట్‌లో వైభవ్ సెంచరీతో సత్తా చాటాడు. వరుసగా సయ్యద్ ముస్తాక్ అలీ, అండర్- 19 ఆసియా కప్, విజయ్ హజారే ట్రోఫీల్లో శతకాల మోత మోగించాడు. తాజాగా అండర్ 19 వరల్డ్‌కప్ ఫైనల్‌లో సెంచరీ సాధించి ఈ రికార్డును కొనసాగిస్తున్నాడు.




# 2027 సంక్రాంతికి సోగ్గాళ్లు...

## అన్నపూర్ణ స్టూడియోస్ ఆసక్తికర అప్ డేట్



కింగ్ నాగార్జున అభిమానులకు అన్నపూర్ణ స్టూడియోస్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. 'బంగార్రాజు' ఫ్రాంచైజీలో రాబోయే సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో, ఏకంగా రిలీజ్ డేట్‌నే ప్రకటించి ఆశ్చర్యపరిచింది. 2027 సంక్రాంతి కానుకగా జనవరి 15న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. అన్నపూర్ణ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ఖాతాలో ఒక ఆసక్తికర పోస్ట్ చేసింది. "వాసివాడి తస్సాదియ్యా.. వచ్చే 15 జనవరి 2027 సంక్రాంతికి సోగ్గాళ్లు వస్తే పండగ ఇంకా కలర్ ఫుల్‌గా ఉంటాది కదా? డేట్ మార్క్ చేసుకోండి" అంటూ పేర్కొంది. ఈ పోస్ట్‌తో, ఇది 'సోగ్గాడే చిన్నినాయనా', 'బంగార్రాజు' చిత్రాల వరుసలో రాబోయే సినిమా అని స్పష్టమైంది. 'బంగార్రాజు' సినిమాలో నాగార్జున ఉపయోగించిన "వాసివాడి తస్సాదియ్యా" అనే డైలాగ్ ఎంత పాపులర్ అయిందో తెలిసిందే. గత చిత్రాలకు దర్శకత్వం వహించిన కల్యాణ్ కృష్ణ కురసాలనే ఈ ప్రాజెక్టును కూడా డైరెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈసారి 'సోగ్గాళ్లు' (బహువచనం) అని పేర్కొనడంతో నాగార్జునతో పాటు అక్కినేని నాగచైతన్య లేదా అఖిల్ కూడా నటించవచ్చనే ప్రచారం ఊపందుకుంది. ఇదే జరిగితే అక్కినేని అభిమానులకు పండగే అని చెప్పాలి. దాదాపు ఏడాది ముందుగానే 2027 సంక్రాంతి వంటి కీలకమైన ఫెస్టివల్ స్లాట్‌ను ఖరారు చేయడం ఇండస్ట్రీలో ఆసక్తి రేపుతోంది. అప్పటికే ఆ పండగ బరిలో ఇతర సీనియర్ హీరోల సినిమాలు కూడా ఉన్నట్లు వార్తలు వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద పోటీ రసవత్తరంగా ఉండే అవకాశం ఉంది. సినిమా టైటిల్, పూర్తి నటీనటుల వివరాలపై అధికారిక ప్రకటన కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు.

# 14న 'పెద్ది' నుంచి రెండో పాట?



మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'పై అంచనాలు పెరుగుతున్నాయి. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామా నుంచి రాబోయే ప్రతి అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'చికిరి చికిరి' సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఇప్పుడు ఈ చిత్రం నుంచి రెండో పాట విడుదలకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' రెండో పాటను ప్రేమికుల దినోత్సవం (వాలంటైన్స్ డే) సందర్భంగా ఈ నెల 14న విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఈ పాట రామ్‌చరణ్ క్యారెక్టర్‌ను పరిచయం చేసే పవర్‌ఫుల్ ఇంట్రడక్షన్ సాంగ్‌గా ఉండబోతోందని సమాచారం. చరణ్ మాస్ ఎనర్జీని, పాత్ర స్వభావాన్ని గ్రాండ్‌గా ఎలివేట్ చేసేలా ఈ గీతాన్ని సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరిచినట్లు తెలుస్తోంది. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఈ పాటకు నృత్యాలు సమకూర్చడం అంచనాలను మరింత పెంచుతోంది. ఈ పాటలో చరణ్ డాన్స్ మూమెంట్స్ అభిమానులకు కనుల పండుగ చేయనున్నాయని టాక్ వినిపిస్తోంది.

వాస్తవానికి ఈ పాటను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని భావించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు వాలంటైన్స్ డేకి రిలీజ్ చేయాలనే నిర్ణయం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సైతం ఈ పాట అభిమానులకు ఒక బ్లాస్ట్‌లా ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్‌చరణ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'పెద్ది'పై దేశవ్యాప్తంగా భారీ క్రేజ్ నెలకొంది. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి' పాట ఒక్క తెలుగులోనే 150 మిలియన్లకు పైగా, అన్ని భాషల్లో కలిపి 200 మిలియన్లకు పైగా వ్యూస్‌తో యూట్యూబ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి.




# ఓటీటీలోనూ దుమ్మురేపుతున్న 'ధురంధర్'



బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ధురంధర్ ఓటీటీలోనూ సెన్సేషన్ సృష్టిస్తోంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ గ్లోబల్ టాప్ -10 నాన్ ఇంగ్లిష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానాన్ని దక్కించుకుంది. ఇండియాతో పాటు పాకిస్థాన్‌లోనూ ఈ మూవీకి విశేష ఆదరణ లభిస్తుండటం విశేషం. నెట్‌ఫ్లిక్స్ విడుదల చేసిన తాజా వీక్లీ నివేదిక ప్రకారం 'ధురంధర్' టాప్‌లో నిలిచింది. ఇప్పటివరకు ఈ సినిమాకు 7.6 మిలియన్ వ్యూస్ దక్కినట్లు వెల్లడించింది. 2025 డిసెంబరు 5న థియేటర్లలో విడుదలైన ఈ మూవీ తొలి షో నుంచే మౌత్ టాక్‌తో దూసుకెళ్లింది. సీక్రెట్ ఏజెంట్‌గా హీరో రణ్‌వీర్ సింగ్ లుక్స్, యాక్టింగ్‌తో పాటు విలన్‌గా అక్షయ్ ఖన్నా నటన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. యాక్షన్ సన్నివేశాలు కూడా సినిమాకు ప్లస్‌గా మారాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల రికార్డులు సృష్టించిన 'ధురంధర్' దాదాపు రూ.1400 కోట్ల కలెక్షన్లతో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఎక్కువ కలెక్షన్లు రాబట్టిన భారతీయ చిత్రాల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచిన ఈ సినిమా.. కేవలం ఒక్క భాషలో (హిందీ) విడుదలై అత్యధిక వసూళ్లు సాధించిన రెండో చిత్రంగా రికార్డు సాధించింది.

ప్రస్తుతం ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ స్ట్రీమింగ్ అవుతోంది. ఇక ఈ చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర్ 2' కూడా సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయనున్నట్లు సమాచారం. దాదాపుగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సీక్వెల్ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. కథలో ఒకటి రెండు కొత్త పాత్రలను జోడిస్తున్నట్లు బాలీవుడ్ టాక్. దర్శకుడు ఆదిత్యధర్ అదనపు మెరుగులు దిద్ది చిత్రాన్ని మరింత గ్రాండ్‌గా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదల చేసిన 'ధురంధర్ 2' టీజర్ ప్రేక్షకుల్లో అంచనాలను భారీగా పెంచింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**